# వివాహం

రచన:
శ్రీ సుంకరబారతీ రాంభాబు

ఆ చిన్నకొండ చివరంటూ ఎక్కి పెద్ద బండరాయి మీద కూర్చోడం నా దిన చర్యలలో ఒకటి. మామూలుగా ఆరోజు కూడా కొండ ఎక్కి... కూర్చున్నాను. క్రిందనున్న ఊరు చెట్ల చాటునుండి, కొద్ది కొద్దిగా కనిపిస్తుంది. ఊరి చుట్టూ పచ్చని పంట భూములు, ప్రకృతి మాతదరించిన పచ్చ చీరాలావుంది. కొండచాటున ఎత్తైన వృక్షాలు మిన్నంటు తున్నాయి. పూర్వం ఈ కొండమీద ఏదో కోట ఉండేదట. ఇప్పుడు మాత్రం శిథిలమయిన శిల్పాలు, ఎత్తైన గోడలువున్నాయి. చల్లని గాలి మనసుకు ఆహ్లాదకరంగా వుంది. ప్రకృతిలో లీనమయి ఉన్న నేను...

'హలో' అన్నమాటకు ఏనుతిరిగి చూసేను. ఎదురుగా విజయ నిలబడివుంది. భుజంటిన శిరోజాలు గాలికి ఎగిరి, ఆమె ముఖంమీద; దోబూచులాడుతున్నాయి. నడిచి వచ్చిన కారణంగా నుదుటిపై చమటీ బిందువులు, నీరెండలో ముత్యాల్లా మెరుస్తున్నాయి. నేను కూర్చున్న ప్రదేశంలోనే కొద్ది దూరంగా కూర్చొంది.

'బావా! ఈవేళ నితో ముఖాముఖగా ఒక విషయం మాట్లాడాలి' అన్నది విజయ.

'ఏ విషయం'? అన్నాను నేను.

'నాన్న నాకు పెళ్ళి సంభంధాలు చూస్తున్నారు.'

'సంతోషం శీఘ్రమే కల్యాణ ప్రాప్తిరస్తు!' ఆమె నెత్తిమీద చేయిపెట్టి దీవిస్తూ అన్నాను.

'చాల్లే వేళాకోళం కట్టిపెట్టు'

విజయా నేను చెప్పేది వేళాకోళంకాదు. నిజమే మాట్లాడుతున్నాను. నీవకింటి దానివయి కాపురం వస్తుంటే నాకు చూడాలని వుంది అన్నాను. 'రాజా!' ఆమె కన్నులు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి.

.......................

'బావా! నీవిలా అంటావని నేను కలలో కూడా అనుకోలేదు. చిన్నప్పటినుండి నివే నా...తని అభిప్రాయపడ్డాను. కాని నీ విప్పుడు...యిలాగంటావని ఊహించుకోలేకపోయేను.' జలజలమని కన్నీరు ఆమె చంపల మీదుగా కారిపోతుంది.

'క్షమించు విజయా! నీవు నేను ఒకే చోట పెరిగినంత మాత్రాన్న, చదువుకున్నంత మాత్రాన్న మనద్దిరి మనసులు కలుస్తాయని నీవు ఊహించుకున్నందుకు నేను చాలా చింతుస్తున్నాను.' అన్నాను.

'రాజా!' ఆమె కఠం వణుకుతుంది, 'అయితే నన్ను నీవు ప్రేమించటం లేదా!?

'.......................'

'చెప్పు రాజా! చెప్పు, నిన్ను ప్రేమించడం లేదని నా ముఖంలోకి సూటిగా చూసి చెప్పు.' భుజాలు కుదుపుతూ అన్నది.

'నన్ను క్షమించు విజయా! ఈ విషయంలో నన్ను వొత్తిడి చేయక ప్లీజ్ వెళ్ళిపో' అన్నాను.

పెనుతుపాను లేగిన తరువాత సముద్రంలో కలిగే అలజడి...ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంది. వణుకుతున్న పెదాలను మునిపంటితో నొక్కుతూ ఆవేశాన్ని దిగమింగుతున్న రూపాన్ని చూసి నాకు జాలివేసింది.

విజయా- నేనూ రాధ ప్రేమించుకున్నాము, అని నా మనసులో మాట ఆమెతో చెప్పలేక పోయేను.

♦ ♦ ♦ ♦

నేను పసికందుగా ఉండగానే నాన్న చనిపోయేడు. అమ్మ నాన్నగారి దగ్గరకు రావలిసి వచ్చింది. నాకు ఎనిమిదవ ఏటనే అమ్మ కూడా కనుమూసింది. అప్పటినుండి అమ్మా-నాన్న నాకు మావయ్యే. తల్లి లేనిపిల్ల విజయను, నన్నూ రెండు కళ్లలా పెంచేరు. ప్రపంచంలో నాకు తెలిసిన దైవం మావయ్యే. నన్ను ఏ విషయాలలో కూడా అడ్డు చెప్పేవారు కాదు. బి. ఏ పూర్తిచేసేటప్పటికి నాకు చదువుమీద విరక్తి కలిగింది, చదవమని మావయ్యకూడా బలవతం పెట్టలేదు, 'విజయ' మాత్రం యమ్. బి. బి. యస్ పూర్తిచేసింది. కాలేజి చదువులోనే 'రాధ'తో నాకు పరిచయం అయింది......

'రాధ' కాలేజి లెక్చరర్ గోవిందరావుగారి ఏకైక ముద్దులపట్టి. నాకు 'స్టడీస్'లో ఏమయినా 'డౌట్'లుంటే గోవిందరావుగారు యింటి దగ్గిరున్నప్పుడు వెళ్ళి- తెలుసుకుంటూ వుండేవాడిని. రాధతో నాకు పరిచయం ఆయింది. ఆ పరిచయం ముదిరి ప్రేమగా మారింది. కాని ఈ సంగతి రాధ నాన్నగారికి తెలియదు. అందం అనే 'కాటు'లో 'విజయ'ను ఒక వైపు-'రాధ'ను ఒక వైపు నిలపెడతే విజయవైపే 'యొగ్గు' వుంటుంది. 'విజయ' ఎర్రగా వుంటే 'రాధ' చామన చాయగా వుంటుంది. 'విజయ' మాట్లాడుతూ వుంటే వినబుద్ధివేయదు. 'రాధ' మాట్లాడుతూ వుంటే ఎన్ని రోజులయినా అలావినాలని అనిపిస్తుంటుంది. 'విజయకు' సాహిత్యం అంటే పడదు. 'రాధ' ప్రతీ పుస్తకం చదివి ఆ రచయితను విమర్శిస్తుంది. 'రాధ'లో వున్న చలాకీ తనము నన్ను ఆకర్షించి నా చేత ప్రేమించబడింది. విజయను నేను ఎప్పుడూ ప్రేమ అనే దృష్టితో చూడలేదు,,,

వారం రోజులు పోయింతరువాత రాధ దగ్గర నుండి నాకు ఓ లెటర్ వచ్చింది.

‘ప్రియమయిన రాజుకి’ మన విషయము నాన్నగారికి చెప్పేను, కాని ఆయన అంగీకరించలేదు. నాన్నగారు పట్టుకున్న పంతాలకి మా దేవుళ్ళు, వెంటనే నీవు ఏదో విషయము ఆలోచించి లెటరు రాయి,’...నీ రాధ.

ఆ ఉత్తరము చదివిన తరువాత నాకు చాలా బాధ కలిగింది. మావయ్యతో చెప్పుదామనుకున్నాను...రాధను నేను ప్రేమించేను, రాధతో నాకు వివాహం జరిపించమని...కాని నామనసెందుకో అంగీకరించలేదు. ఓ దృఢ నిశ్చయానికి వచ్చేను. వెంటనే రాధకి ఒక లెటర్ వ్రాసేను...

‘ప్రియమయిన రాధకి’ మీ నాన్నగారి అంగీకారముతో మనకి పనిలేదు, మనిద్దరి ‘డిగ్రీ’ లతో ఎక్కడికి పోయినా జీవించగలము. ప్రయాణానికి సిద్ధంగా వుంటావని ఆశిస్తూయున్నాను.’...నీ రాజు.

ఆ రాత్రి అంతా నాకు సరిగా నిద్రపట్టలేదు. ఆలోచనలు నా తలలో కుమ్మరి పురుగుల్లా దొలుచుకుంటున్నాయి...ఎక్కడికి పోవాలి...ఎలా జీవించాలి...‘బి.ఏ.’ డిగ్రీవాడికి ఏ వుద్యోగం వస్తుంది...ఈ సమస్యలన్నీ నా కడ్డుగా వున్నాయి.

విజయ ఆ ఊరిలోనే చిన్న ‘హాస్పటల్’ పెట్టి ప్రజలకు వైద్య సదుపాయం చేకూరుస్తుంది. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది-గంటలకు హాస్పటల్ కు వెళ్ళిపోయేది. మధ్యానము భోజనము హాస్పటల్ కే తెప్పించుకొనేది. సాయంకాలం ఏ ఆరుగంటలకో యింటికివచ్చేది. విజయ అంటే ఆ ఊరి ప్రజలలో మంచి అభిమానం వుంది. విజయ తండ్రి - నామావయ్య...సత్యమూర్తి గారు ఎప్పుడూ యింటి దగ్గరేవుంటూ, భూములకు సంబంధించిన విషయాలు చూసుకుంటూ వుండేవారు. విజయను నాకిచ్చి వివాహం చేయడానికి ఆయన మనసులోనే నిశ్చయించుకున్నారని నాకు తెలుసు.

◆ ◆ ◆ ◆

ఆరోజు ఆ రాత్రి-విజయతో నాదృఢనిశ్చయంగురించి చెప్పడానికి ఆమె గదిలోనికి వెళ్లేను...ఆమె లేదు. నౌకరును-అడిగేను. అమ్మగారు మేడమీద ఉన్నారని చెప్పేడు. మేడ మీదకు వెళ్ళేను...విజయను చూసి వులిక్కిపడ్డాను. పాలనురగలాంటి వెన్నెలలో - విజయ తెల్లని చీరకట్టుకొని వెన్నల వెలుగుమధ్య దేవతలా మెరిసి పోతుంది. విజయతో నా నిశ్చయం గురించి చెప్పేను, పిచ్చిదానిలా నవ్వింది.

‘నువ్వంత పిరికివాడివని’ అనుకోలేదు బావా పదిమంది పెద్దల ముందు-రాధను నీవు వివాహం చేసుకుంటే బాగుంటుంది. మీరు సమాజానికి దూరంగాపోతే ఆ సమాజమే మిమ్మలను బహిష్కరిస్తుంది...నాన్నతో నేను మాట్లాడుతాను. రాధకు నీకు వివాహం జరిపించడానికి ప్రయత్నిస్తాను’...అంది.

‘విజయా-నీవు ఎన్నిప్రయత్నాలు చేసినా ఈ వివాహానికి మాత్రం రాధ తండ్రి వొప్పుకోరు. దయచేసి ఈ విషయం మావయ్యతో చెప్పకు. ఈ రాత్రికే నేను వెళ్ళిపోతున్నాను’ అని చెప్పి కిందకు వచ్చేసేను. బేగ్ లో రెండు జతలు బట్టలు సర్దుకున్నాను. నా దగ్గర యాభై రూపాయలు మాత్రమే నున్నాయి. విజయ రూపాయలు ఇవ్వభోయింది. కాని నేను తీసుకోలేదు. ఆ రాత్రి ఆ ఊరు వదిలి వెళ్ళిపోయేను. వెళ్ళేటప్పుడు మావయ్యతో చెప్పలేదు. ఆయన చాలా బాదపడి వుంటారు. ఆ ఊరు వదిలి తిన్నగా రాధ దగ్గరకు వచ్చేను. కాని...కా...ని ‘విధి’ నాపట్ల వక్రించింది. నేను రాధకు వ్రాసిన లెటరు పొరపాటున రాధ తండ్రికి చేరింది. రాధకు దగ్గర సంబంధం చూసి గుట్టుమట్టుగా వివాహం జరిపించి వేసేరు... అప్పటికే నా ప్రయత్నం ఆలస్యం అయిపోయింది. నేను పెట్టుకున్న ఆశలు-కన్న కలలు, మట్టిలోకలిసి పోయేయి. నాకు ప్రపంచమంతా చీకటిగా కనబడ సాగింది. రాధ నన్ను నమ్మించి మోసం చేసింది. మళ్లీ విజయ దగ్గరకు ఏ మొహం పెట్టుకొని వెళ్ళగలను?...నా బ్రతుకే అంధకారము అయిపోయింది...ఎన్ని ‘ఊర్లు’ తిరిగేనో నాకే తెలియదు. ‘వుద్యోగాన్వేషన’లో ఎన్ని కష్టాలుపడ్డానో నాకే తెలియదు. చివరకు యిక్కడకు చేరేను, స్తిరపడి పోయేను. మళ్ళీ యిప్పుడు ‘జీవితం’ మీద మమకారం ఏర్పడుతుంది. అందుకే-విజయకు, నేను యిక్కడ వున్నట్టు తెలియపరిచేను...అంతవరకు ఏక దాటిగా చెపుతున్న ‘కెప్టెన్‘ రాజు’ ఓసారి ఆగేడు. అతని ముందున్న బల్లమీద ‘త్రిభుతెక్స్రమ్’ పీసాలు గ్లాసులు పేర్చబడి వున్నాయి. మిలటరీ క్యాంపు, సరిహద్దులలో ‘భారత దేశానికి-పాకీస్తాన్ కు’ ఎనిమిది రోజులనుండి ‘హోరాహోరి’గా జరుగుతున్న యుద్ధం, ఆ రోజున కొంచెం తగ్గుముఖం పట్టింది. అంతకు ముందు రోజున జరిగిన యుద్ధంలో-శత్రుదేశానికి అపార నష్టం కలిగించిన కేప్టెన్ రాజుకి గౌరవార్ధం జరిగిన విందు, అది, రాజు...గ్లాసులో కొద్దిగా ‘రమ్’ పోసుకొని త్రాగేడు...మళ్లీ చెప్పడం ప్రారంభించేడు......

‘మీలో చాలామంది యువకులున్నారు, మీరు కూడా నాలా-ప్రేమించిన వారిని తృణీకరించకండి. పవిత్ర

ప్రేమకు మీ హృదయంలో స్థానం యివ్వండి. నా జీవిత రహస్యం మీకు చెపుతున్నాను... కారణం?...... నేను మీ కంటే ఎక్కువ హోదాలో వుండవచ్చు. కాని నేనూ మీలాంటి మానవుడినే-నాకూ ఓ మనసుంది మనము యిప్పుడున్నది యుద్ధ రంగంలో. కొన్ని గంటలు పోయిన తరువాత మనలో ఎంతమంది వీర మరణం పొందుతారో-ఎంతమంది జీవించి వుంటారో చెప్పలేని పరిస్థితి... అందువలనే యిన్నాళ్ళకు నా హృదయంలోని బాధను మీకు చెప్పుతున్నాను.

అంతవరకు ఊపిరి బిగబెట్టి .. వింటున్న సైనికులులో నుండి కరతలధ్వానాలు మిన్ను ముట్టేయి. 'కేప్టెన్ రాజ్ జిందాబాద్' అన్న కేకలు వినిపించేయి.

......యింతలో అకస్మాత్తుగా...బయట శత్రు విమానాల మ్రోత, భాంబింగ్ శబ్దం, పిరంగులు ప్రేలుస్తున్న చప్పుడు, గాలిలో నిప్పురవ్వల విలయ తాండవం... కొలది సేపటిలో... ఆర్తనాధాలు, అహాకారాలు.. చిక్కని చీకటి... తుపాకిగుండ్ల ధ్వనితో ఆ ప్రదేశం నిండిపోయింది... శత్రువు అకస్మాత్తుగా వచ్చి భారత స్థావరాలపై కాల్పులు ప్రారంభించేడు.

తెల్లవారింది... కేప్టెన్ రాజు పాకిస్తాన్ 'టేంక్'లను అధిక సంఖ్యలో నష్టపరిచేడు. కాని ఓ శత్రుసైనికుడు ప్రేల్చిన తుపాకీగుండు-రాజు గుండెల్లో నుండి దూసుకు పోవడంవలన నేలకొరిగి పోయేడు. వెంటనే 'కేప్టెన్ రాజు'ని సైనిక 'హాస్పటిల్'లో జాయిన్ చేసేరు.

'రాజు' ఓ సారి కళ్లు విప్పి చూసేడు. గుండెమీద పెద్దకట్టు కట్టబడి వుంది.. గుండెల్లో భాదగా వుంది. అబ్బా అన్నాడు. లేగిసి కూర్చోడానికి ప్రయత్నించేడు, కాని కూర్చోలేకపోయేడు. యిటు తిరిగి చూసేడు. ప్రక్కనున్న స్టూల్ మీద ఓ కవర్ కనబడింది. తీసి చూసేడు... తన అడ్రెస్‌కే వచ్చింది, కవర్ చించేడు. అక్షరాలు మసకగా కనబడుతున్నాయి. అయినా ఒక్కొక్క అక్షరం కలిపి చదవ సాగేడు...

భావా, చాలాకాలానికి నీ దగ్గరనుండి జాబువచ్చింది. నీవు యిల్లు వదిలి వెళ్ళిన సంవత్సరములోనే నాన్న మరణించేరు. నీవు క్షేమంగా ఉన్నందుకు చాలా సంతోషము......వివాహం చేసుకుంటానని వ్రాసేవు. క్షమించు



పి. ఎస్. ఆర్. పిక్చర్స్‌వారి 'పిల్లా? పిడుగా?' చిత్రంలో జ్యోతిలక్ష్మి, రామకృష్ణ.

...నాకింక ఆ అభిప్రాయంలేదు. నా జీవితం అంతా రోగులకు సేవ చేస్తూ జీవించడం. యిదే నా ఆశయం.
నిర్భాగ్యురాలు-విజయ.

రాజుకి కొన్ని అక్షరాలు కనిపించేయి. కొన్ని కనిపించలేదు. అయినా ఉత్తరాన్ని చదివి క్రింద పడవేసి 'అబ్బా' అని మూలిగేడు.

♦ ♦ ♦ ♦

ఆ రోజు సాయంత్రం రేడియోలో యుద్ధవార్తలు వింటున్న విజయ ఓసారి అదిరి పడింది... 'పాకిస్తాన్ సైనిక టాంకులను విపరీతంగా నష్టపరిచిన కేప్టెన్ రాజు నిన్న మధ్యానము సైనిక హాస్పిటల్‌లో మృతి చెందేడు. అతనికి భారత ప్రభుత్వం'... ఏదో వినబడుతుంది. రేడియో ఆపివేసింది విజయ.

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులము కాదు. —సంపాదకుడు.